సాక్షి
విశాఖపట్నం

మంగళవారం। 18। మార్చి। 2025



తూర్పు తీరం భద్రతకు సైకిల్‌థాన్ 8లో



విశాఖ చేరుకున్న ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు 8లో

రంజాన్ వేళలు

ఇఫ్తార్	సహర్
మంగళ	బుధ
6.09	4.49

ప్రజా ప్రదక్షిణలే..



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ హరేంధిర ప్రసాద్, జేసీ మయూర్ అశోక్



ఈమె పేరు కంచిపాటి రాజేశ్వరి, గాజువాక నుంచి వచ్చారు. గతంలో టిడ్కో ఇంటి కోసం దరఖాస్తు చేసుకొని రూ.25 వేలు డీడీని జీవీఎంసీ యూసీడీ విభాగంలో చెల్లించారు. అయితే ఇల్లు రాకపోవడంతో ఏడాది క్రితం జీవీఎంసీ అధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తులో ఆధార్ కార్డు నంబర్ తప్పుగా పడడం వల్ల ఇల్లు మంజూరు కాలేదని జవాబిచ్చి సమస్య పరిష్కారమైనట్లు చూపించేశారు. తర్వాత నుంచి పలుమార్లు కలెక్టరేట్‌లోని అధికారులకు ఫిర్యాదు చేసినా ఇంత వరకు పట్టించుకోలేదు.

9 నెలలుగా కార్పొరేటర్ ప్రదక్షిణ



జోడుగుళ్ల పాలెంలో గత ప్రభుత్వ హయాంలో రూ.75 లక్షల వ్యయంతో కమ్యూనిటీ హాల్ నిర్మాణం తలపెట్టారు. దాదాపు 95 శాతం పనులు పూర్తయ్యాయి. ఎన్నికల కారణంగా ఫినిషింగ్ పనులు ఆగిపోయాయి. ఈ పనులు పూర్తి చేసి కమ్యూనిటీ హాల్ అందుబాటులోకి తీసుకురావాలని జీవీఎంసీ 9వ వార్డు కార్పొరేటర్ కోరుకొండ వెంకటరత్న స్వాతిదాస్ 9 నెలలుగా పలు దఫాలుగా కలెక్టర్‌కు పీజీఆర్ఎస్‌లో విన్నవించుకుంటూ ఉన్నారు. అయినా పట్టించుకోవడం లేదు. కార్పొరేటర్‌గా ప్రజల సమస్య పరిష్కరించాలని కోరినా పట్టించుకోకుంటే ఇక పీజీఆర్ఎస్ పెట్టడమెందుకని స్వాతిదాస్ ఆక్రోశం వ్యక్తం చేస్తున్నారు.

మా భూమిని లాక్కోవాలని చూస్తున్నారు



మా గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే నం.20లో 5.20 ఎకరాల జిరాయితీ భూమి మా తాతల కాలం నుంచి సాగు చేసుకుంటున్నాం. మా గ్రామంలో ఇనాం సెటిల్‌మెంట్ కాకపోవడంతో ఎలాంటి పాస్‌బుక్ లేకపోయినా.. మా తల్లిదండ్రులు రాజుల దగ్గర నుంచి కొనుక్కొని 2.38 ఎకరాలకు ఎఫ్‌సీవో ఆధారంగా అడంగల్‌లో మా పేరుతో ఉన్నాయి. కొందరు స్థానికులు మా భూమిని ఆక్రమించుకునేందుకు తప్పుడు డాక్యుమెంట్లు సృష్టించి.. లేనిపోని ఫిర్యాదులు చేస్తున్నారు. వీరికి స్థానిక రెవెన్యూ సిబ్బంది సహకరిస్తున్నారు. దయచేసి న్యాయం చేయాలని ప్రభుత్వాన్ని కోరుతున్నాం.

– సన్యాసినాయుడు, అర్జీదారుడు నారాయణరాజుపేట



క్యూలో నిల్చున్న అర్జీదారులు

- ప్రజా సమస్యల అపరిష్కృత వేదికగా పీజీఆర్ఎస్
- తమ పరిధిలో లేదని చెప్పినా.. పరిష్కరించినట్లే.!
- క్షేత్రస్థాయిలో మాత్రం పరిష్కారం శూన్యమే..
- రెవెన్యూ పరిధిలోనే అత్యధిక ఫిర్యాదులు
- తర్వాత స్థానంలో మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్

సాక్షి, విశాఖపట్నం/మహారాణిపేట/బీచ్‌రోడ్డు : ప్రజా సమస్యల పరిష్కార వేదిక.. కూటమి సర్కారు ఆర్భాటంగా పెట్టిన పేరు.. వినతుల పరిష్కారం తీరు మాత్రం విడ్డూరంగా ఉంది. అంతా అంకెల గారడీ అన్నచందంగా మారింది. కలెక్టర్ సార్ ఎదుట సమస్య చెబితే పరిష్కారం దొరుకుతుందని ఆశతో సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి నిరాశే మిగులుతుంది. అర్జీలు పరిష్కరించకుండానే.. అధికారులు ఏదో ఒక రిప్లయ్ ఇచ్చి పరిష్కరించినట్లు రికార్డుల్లోకి ఎక్కించేస్తున్నారు. ఇదే తంతు ప్రతీ వారం జరుగుతున్నా..! కలెక్టర్ సార్ మాత్రం అర్జీలు రిపీట్ కావొద్దనే మాటనే రిపీట్ చేస్తున్నారే తప్పా.. అర్జీలకు ఏవిధమైన పరిష్కారం చూపిస్తున్నారో పరిశీలిస్తే డొల్లతనం వెలుగులోకి వస్తుందని అర్జీదారులు వాపోతున్నారు. కేవలం దరఖాస్తులు స్వీకరించడమే తప్ప వాటిపై దృష్టి పెట్టకపోవడంతో పీజీఆర్ఎస్‌పై నమ్మకం సన్నగిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వచ్చిన దరఖాస్తుల్లో ముఖ్యంగా కీలకమైన రెవెన్యూ శాఖకు సంబంధినవే ఎక్కువగా ఉండటం రెవెన్యూ అధికారుల పనితీరుకు అద్దం పడుతోంది. సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు పెద్ద ఎత్తున అర్జీదారులు వచ్చి అధికారుల వద్ద ఎప్పటిలాగానే తమ గోడు వెళ్లబోసుకున్నారు.

ఫోకస్



అర్జీలు నమోదు చేస్తున్న సిబ్బంది

భూమాయలే ఎక్కువ.!

పీజీఆర్ఎస్‌కు వచ్చిన ఫిర్యాదులు చూస్తుంటే.. కూటమి ప్రభుత్వ హయాంలో భూముల దోపిడీ, ఆక్రమణలు, దౌర్జన్యాలు ఎంతలా పెచ్చరిల్లుతున్నాయో.. వాటికి రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఎలా సహకరిస్తున్నారో స్పష్టమవుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కు 26,267 ఫిర్యాదులు అందాయి. వీటిలో దాదాపు 44 శాతం ఫిర్యాదులు అంటే.. ఏకంగా 10,900 ఫిర్యాదులు రెవెన్యూ వ్యవహారాలపైనే ఉండడం గమనార్హం. భూ హక్కులపై 3,765 అర్జీలు అందగా.. రీ సర్వేపై 1,963, ప్రభుత్వ భూముల ఆక్రమణలపై 1,821 ఫిర్యాదులు అందాయి. వచ్చిన ఫిర్యాదుల్లో 93 శాతం వరకూ పరిష్కరించేశామని రెవెన్యూ అధికారులు లెక్కలో చూపిస్తున్నా.. క్షేత్రస్థాయిలో మాత్రం ఆక్రమణలు యథాతథంగా కొనసాగుతున్నాయి.



అర్జీదారులు వేచి ఉన్న ప్రదేశంలో ఫ్యాన్లు శూన్యం

ఇప్పటివరకు పీజీఆర్ఎస్‌కు వచ్చిన ఫిర్యాదులు

మొత్తం ఫిర్యాదులు	26,267
రెవెన్యూ (సీసీఎల్ఏ) ఫిర్యాదులు	10,900
మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్‌పై ఫిర్యాదులు	7,070
ఎస్ఎస్ఎల్ఆర్‌పై ఫిర్యాదులు	2,634
పోలీస్ విభాగంపై వచ్చిన ఫిర్యాదులు	1,664
మార్కెటింగ్‌పై వచ్చిన ఫిర్యాదులు	513
పరిష్కరించినట్లు చూపిస్తున్న ఫిర్యాదులు	24,413
పెండింగ్‌లో ఉన్నవి	1,682
రీ ఓపెన్ అయిన ఫిర్యాదులు	2,080

ప్రార్థనా స్థలాన్ని కేటాయించాలి



మద్రిపాలెం ఏరియాలో ప్రార్థనలు చేసుకోవడానికి ముస్లింలకు ప్రత్యేకంగా స్థలం లేదు. ఇందుకోసం పలుమార్లు దరఖాస్తు చేశాం. మంత్రులు, ఎమ్మెల్యే, ఎంపీలకు వినతి పత్రాలు ఇచ్చాం. అయినా స్పందన లేదు. మద్రిపాలెం ఆర్‌అండ్‌బీ వద్ద గల ప్రభుత్వ స్థలాన్ని ముస్లింలకు కేటాయించాలని మరోమారు వినతిపత్రం అందజేశాం.

– ఎం.సుభాని, మజీద్–ఈ–అల్ఫత్, మద్రిపాలెం

ముస్లిం దూదేకులను బీసీ బీలో చేర్చాలి



ముస్లిం దూదేకులు అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్నారు. బీసీ–ఈ లోకి మార్పు చేయడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. ముఖ్యంగా తమ పిల్లలు చదువుల్లో ముందుకు వెళ్లలేకపోతున్నారు. ముస్లిం దూదేకులకు న్యాయం చేయాలి. గతంలో మాదిరిగా బీసీ–బీ లో చేర్చాలి. వెంటనే తహసీల్దార్లకు ఆదేశాలు ఇవ్వాలి.

– షేక్ బాబ్జి, మాజీ అధ్యక్షుడు, ఉమ్మడి విశాఖ జిల్లా ముస్లిం నూర్ భాష దూదేకుల సంక్షేమ సంఘం

కలెక్టర్ చెప్పినా సర్వే చేయడం లేదు



నేను దివ్యాంగుడిని. మా తాతల నాటి ఆస్తిని మేము పంచుకున్నాం. మా పెద నాన్న మనుమలు నా వాటాలో కొంతభాగాన్ని నాకు తెలియకుండా అమ్మేశారు. ఈ విషయమై మూడు నెలల క్రితం కలెక్టర్‌కి ఫిర్యాదు చేశాను. ఆయన తహసీల్దార్‌ను పిలిచి సర్వే చేసిన నాకు న్యాయం చేయాలని చెప్పారు. కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలను కూడా లెక్క చేయకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

–గడ్డ అప్పల నాయుడు, పద్మనాభం

కూతురు, అల్లుడు హింసిస్తున్నారు..



నా కూతురు, అల్లుడు, కుమారుడు గత కొన్ని నెలలుగా తీవ్రంగా వేధిస్తున్నారు. ఇంట్లో చొరబడి వస్తువులను చిందరవందర చేస్తున్నారు. ఈ విషయమై పోలీసులకు ఫిర్యాదు చేస్తే వాళ్లని పిలిచి మందలించారు. అయినా సరే వారిలో ఎటువంటి మార్పు రాలేదు. వృద్ధురాలైన నన్ను హింసిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.

–జయలక్ష్మి, మురళీనగర్

విన్నపాలకు విలువ లేదా?

దాబాగార్డెన్స్ : ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి కూటమి ప్రభుత్వం గతేడాది జూన్ 24న శ్రీకారం చుట్టింది. దీర్ఘకాలికంగా నిలిచిపోయిన సమస్యలు పరిష్కారమవుతాయని ప్రజలంతా సంబరపడ్డారు. కానీ ఆశించినంతగా పీజీఆర్ఎస్ కార్యక్రమం సాగడం లేదనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఫిర్యాదులైతే స్వీకరిస్తున్నారు కానీ సమస్య పరిష్కారం కావడం లేదు. తొమ్మిది నెలలుగా ఎంతో మంది జీవీఎంసీ, జోనల్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తూనే ఉన్నారు.

ఫిర్యాదులు ఇలా..

పీజీఆర్ఎస్‌కు ఇప్పటివరకు 6,985 ఫిర్యాదులు రాగా వీటిలో 364 ప్రొగ్రెస్‌లో ఉన్నాయి. 5,608 ఫిర్యాదులు పరిష్కరించినట్లు, 13 ఫిర్యాదులు త్వరలోనే పరిష్కారం కానున్నట్లు చూపారు. మిగిలిన వెయ్యి ఫిర్యాదుల్లో 58 పెండింగ్‌లో ఉన్నాయి. 942 రిడ్రెస్డ్‌గా చూపారు. అయితే అత్యధికంగా పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. రెవెన్యూ, యూసీడీ, ఇంజనీరింగ్ తదితర విభాగాలకు సంబంధించి ఫిర్యాదులు కూడా వస్తున్నాయి. ప్రజల నుంచి అందిన ఫిర్యాదులు నిర్ణీత సమయంలోనే పరిష్కరించాలని జీవీఎంసీ కమిషనర్ సంబంధిత అధికారులను ఆదేశించినా పట్టించుకున్న దాఖలాలు కనిపించడం లేదు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న మేయర్ వెంకటకుమారి, అదనపు కమిషనర్ రమణమూర్తి

జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 86 వినతులు అందాయి. నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జీవీఎంసీ అదనపు కమిషనర్ డీవీ రమణమూర్తి ఫిర్యాదులు స్వీకరించారు.

ఎన్ని సార్లు తిరగాలి



దేశపాత్రునిపాలెం చెక్ పోస్ట్ వద్ద ప్రధాన రోడ్డుపై ఎనిమిది నెలలుగా వీధి లైట్లు వెలగడం లేదు. తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. నేరాలు జరుగుతున్నాయి. సాయినగర్, అశోక్‌నగర్ తదితర ప్రాంతాల వారు అనేక ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ విషయమై జీవీఎంసీ, జోనల్ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి ఫిర్యాదులు చేయడం తప్ప.. సమస్య మాత్రం ఎక్కడి గొంగలి అక్కడే అన్న రీతిన ఉంది. ఇదిలా ఉండగా దేశపాత్రునిపాలెం వద్ద సుమారు 93 సెంట్లు ప్రభుత్వ భూమి కబ్జా అవుతుందని అధికారుల దృష్టికి తీసుకొచ్చినా స్పందన లేదు. అధికారులు స్పందించి వీధిలైట్ల సమస్యతో పాటు ఆక్రమణకు గురవుతున్న స్థలంలో పార్కు ఏర్పాటు చేయాలి.

– సుగుణాకర్, దేశపాత్రుని పాలెం

రహదారి వేయండి మహాప్రభో



కళింగనగర్ 48ఏ బస్టాప్ నుంచి జాతీయ రహదారి పంజాబ్ హోటల్ జంక్షన్‌కు వెళ్లేందుకు రెండు రహదారులు ఉత్తరం నుంచి దక్షిణం వైపు నుంచి ఉన్నాయి. దక్షిణ వైపుగా ప్రయాణం చేసేటప్పుడు కుడివైపు ఉండే రహదారి మరీ చిన్నదిగా ఉంది. మురుగు నీరు రహదారి మీదుగా ప్రవహిస్తోంది. వర్షాకాలంలో అయితే పరిస్థితి మరింత దారుణంగా ఉంటోంది. ఈ ప్రాంతంలో సుమారు 1500 కుటుంబాలు నివసిస్తున్నాయి. చిన్న పిల్లలు స్కూళ్లకు వెళ్తున్నప్పుడు ఆటో ప్రయాణం మరింత కష్టంగా ఉంటోంది. వెంటనే రహదారి వేయాలి.

– 51వ వార్డు మహిళలు

నా డీడీ ఎక్కడ?



2019లో ఇల్లు మంజూరైందన్నారు. రూ.25వేలు డీడీ కట్టాం. ఇప్పటి వరకు ఇల్లు లేదు. బ్యాంకులో తీసుకున్న డీడీకి సంబంధించిన వివరాలు కూడా అధికారుల దృష్టికి తీసుకొచ్చాను. డీడీ కనిపించడం లేదని చెబుతున్నారు. మరి నేను కట్టిన డీడీ ఎక్కడకు వెళ్లింది. ఈ విషయమై పీజీఆర్ఎస్‌లో పలుమార్లు ఫిర్యాదు చేశాను. కానీ ప్రయోజనం లేదు.

– ఆదారి భవాని, ఉషోదయ జంక్షన్

సార్ నా బిల్లులు చెల్లించండి..

గతేడాది మార్చి 27నే లాస్ట్ పేమెంట్. 2024 జూన్ నెలలో వర్క్స్ చేశాను. ఇప్పటి వరకు చేసిన పనులకు ఒక్క బిల్లు కూడా చెల్లించలేదు. అప్పులు చేసి పనులు చేశాం. వడ్డీలు పెరిగిపోతున్నాయి. ఈఎండీలు ఇస్తానన్నారు. అతీగతీ లేదు. ఈఎండీల కోసం సచివాలయ సిబ్బందిని ప్రత్యేకంగా వేశారు. ఆమె ఏ వర్క్ చేయడం లేదు. డీపీలు పంపించడం మానేశారు. నేను చేసిన పనులకు సంబంధించి బిల్లులు రావల్సి ఉంది.

– బుజ్జి, జీవీఎంసీ కాంట్రాక్టర్

రిసార్ట్ ముసుగులో పేకాట క్లబ్



పేకాట డెన్‌గా మారిందన్న ఆరోపణలున్న రిసార్ట్

కూటమి ప్రభుత్వానికి చెందిన ఘట్టమనేని సుభాష్ చంద్రబోస్ అనే వ్యక్తి రిసార్టు ముసుగులో పేకాట క్లబ్ నిర్వహిస్తున్నారంటూ ఆనందపురం ప్రాంతానికి చెందిన కొందరు కూటమి నేతలు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. గిడిజాల పంచాయతీ దిబ్బడివానిపాలెం సమీపంలో ప్రభుత్వ భూమిని కొంత ఆక్రమించి తన సొంత స్థలంలో రిసార్టు నిర్మించారనీ.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పేకాట డెన్‌గా మార్చేశారంటూ ఆరోపించారు. గతంలో సదరు సుభాష్ చంద్రబోస్‌పై క్రిమినల్ కేసు కూడా నమోదైందనీ.. స్థానిక రెవెన్యూ అధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు.

మా కుటుంబాన్ని ఆదుకోవాలి



నా భర్త జీడీ గోవింద్ విశాఖ కేంద్ర కారాగారంలో 2019లో రిమాండ్ ఖైదీగా ఉంటూ ఆత్మహత్యాయత్నానికి పాల్పడి కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ చనిపోయారు. దీంతో నా కుటుంబం రోడ్డున పడింది. నలుగురు పిల్లలతో పోషణ భారంగా మారింది. ప్రభుత్వమే మా కుటుంబాన్ని ఆదుకోవాలి.

– జీడీ కళ, వాంబేకాలనీ, మధురవాడ

ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వద్దు

రాత్రి వరకు ఫిర్యాదులు స్వీకరించిన సీపీ

విశాఖ సిటీ: పీజీఆర్ఎస్‌లో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంలో అలసత్వం వద్దని పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి పోలీస్ అధికారులను సూచించారు. సోమవారం పోలీస్ సమావేశ మందిరంలో నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు 113 ఫిర్యాదులు వచ్చాయి. సీపీ స్వయంగా ఫిర్యాదుదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అయితే ఈ కార్యక్రమం మధ్యలో నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో సమావేశం ఉండడంతో సీపీ దానికి హాజరవ్వాల్సి వచ్చింది. మధ్యాహ్నం వరకు ఆ సమావేశం జరిగింది. అయినప్పటికీ ఫిర్యాదుదారులు సీపీ కోసం వేచి ఉన్నారు. సాయంత్రం కూడా ఫిర్యాదుదారులు రావడంతో రాత్రి 9.30 వరకు సీపీ బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు.

ప్రజాదర్బార్‌కు 23 ఫిర్యాదులు

విశాఖ సిటీ: ప్రజాదర్బార్‌కు వచ్చిన ఫిర్యాదులను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. సోమవారం వీఎంఆర్‌డీఏ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజాదర్బార్‌కు 23 ఫిర్యాదులు వచ్చాయి. పరిపాలన విభాగానికి సంబంధించి 7, ప్లానింగ్‌కు 9, ఎస్టేట్‌కు చెందినవి 7 ఫిర్యాదులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో జాయింట్ కమిషనర్ కె.రమేష్, కార్యదర్శి మురళీకృష్ణ, ఇతర విభాగాల అధికారులు పాల్గొన్నారు.

తొలిరోజు ప్రశాంతం

- పదో తరగతి పరీక్షకు 99.58 శాతం హాజరు
- కేంద్రాలను తనిఖీ చేసిన రాష్ట్ర అబ్జర్వర్ దేవానంద్ రెడ్డి

విశాఖ విద్య: జిల్లాలో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లాలోని 134 కేంద్రాల్లో జరిగిన తొలిరోజు పరీక్షకు 28,659 మంది విద్యార్థులకుగానూ 28,540 మంది హాజరయ్యారు. 119 మంది గైర్హాజరయ్యారు. తొలిరోజు తెలుగు పరీక్షకు 99.58 శాతం హాజరు నమోదైనట్లు డీఈవో ఎస్. ప్రేమ్ కుమార్ వెల్లడించారు. ఉదయం 9.30 గంటలకు పరీక్ష ప్రారంభం కాగా, 8.45 గంటల నుంచే విద్యార్థులను కేంద్రాల్లోకి అనుమతించారు. విద్యార్థులను గేటు వద్దనే పూర్తి స్థాయిలో తనిఖీ చేసి కేంద్రాల్లోకి పంపించారు. మహిళా పోలీసులను కేంద్రాల వద్ద విధుల్లో ఉంచారు. ఎటువంటి అవాంతరాలు చోటుచేసుకోకుండా కేంద్రాల వద్ద పోలీసు బందోబస్తు నిర్వహించారు. మాస్ కాపీయింగ్‌కు ఆస్కారం లేకుండా పరీక్ష కేంద్రాలపై గట్టి నిఘా పెట్టారు. స్క్వాడ్ అధికారులు జిల్లాలోని 32 కేంద్రాలను తనిఖీ చేసి, పరీక్షల జరుగుతున్న తీరును నిశితంగా పరిశీలించారు. డీఈవో ప్రేమ్ కుమార్ 10 కేంద్రాలను తనిఖీ చేశారు. తొలిరోజు ఎటువంటి మాస్ కాపీయింగ్ కేసులు నమోదు కాలేదని డీఈవో తెలిపారు. జిల్లా అబ్జర్వర్‌గా నియమితులైన రాష్ట్ర కస్తూర్బా గాంధీ విద్యాలయాల డైరెక్టర్ డి.దేవానంద్ రెడ్డి ఆరు కేంద్రాలను తనిఖీ చేశారు. అలాగే సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో టెన్త్ పరీక్షలు సైతం సోమవారం నుంచి ప్రారంభమయ్యాయి. జిల్లాలోని 15 కేంద్రాల్లో తొలిరోజు హిందీ పరీక్షకు 57 మంది విద్యార్థులు నమోదు చేసుకోగా, వీరిలో 49 మంది హాజరయ్యారు.



సంపత్ వినాయక ఆలయం వద్ద విద్యార్థుల పూజలు



రూమ్ నంబర్ చూసుకుంటున్న విద్యార్థులు



కేడీపీఎం స్కూల్ కేంద్రంలో పరీక్షకు హాజరైన అంధ విద్యార్థులు



ఎస్ఎఫ్ఎస్ స్కూల్ వద్ద విద్యార్థులు



కేడీపీఎం స్కూల్‌లో పరీక్షకు హాజరైన మూగ, చెవిటి విద్యార్థులు

అడుగులకు మడుగులు.. అక్రమార్కులకు గొడుగులు

- కూటమి సేవలో తరిస్తున్న జీవీఎంసీ అధికారులు
- వారి అనుచరుల అక్రమ నిర్మాణాలకు సహకారాలు
- సీఆర్‌జెడ్ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాల్లో వ్యాపారాలు
- హైకోర్టు ఆదేశాలతో హడావుడిగా 4 రిసార్ట్, బార్లపై విచారణ

విశాఖ సిటీ: జీవీఎంసీ అధికారులు కూటమి నేతల సేవలో తరిస్తున్నారన్న ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. నాయకుల అనుచరుల అక్రమ నిర్మాణాలకు సహాయ సహకారాలు అందిస్తున్న తీరు వివాదాస్పదమవుతోంది. సీఆర్‌జెడ్ నిబంధనలకు విరుద్ధంగా నిర్మాణాలు చేపట్టి రిసార్టులు, బార్ అండ్ రెస్టారెంట్లు ఏర్పాటు చేసినా అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరించడం గమనార్హం. తాజాగా హైకోర్టు ఆదేశాలతో విచారణకు హడావుడి చేస్తుండడం చర్చనీయాంశమవుతోంది. బీచ్ రోడ్డులో సీఆర్‌జెడ్ నిబంధనలకు విరుద్ధంగా రిసార్టులు, బార్ అండ్ రెస్టారెంట్లు, రెస్టో బార్లు పుట్టగొడుగుల్లా పుట్టుకొచ్చాయి. నిబంధనలు పాటించని వీటిపై జీవీఎంసీ అధికారులకు ఎన్ని ఫిర్యాదులు అందినప్పటికీ పట్టించుకోలేదు. తూతూ మంత్రంగా నోటీసులిచ్చి చేతులు దులుపుకున్నారు.

వ్యాపారులకు నోటీసులు : హైకోర్టు ఆదేశాల మేరకు ఈ కమిటీ విచారణకు సిద్ధమైంది. సీఆర్‌జెడ్ నిబంధనలకు విరుద్ధంగా వ్యాపారాలు నిర్వహిస్తున్న నాలుగు సంస్థలకు జీవీఎంసీ జోన్–1 కమిషనర్ సోమవారం నోటీసులు జారీ చేశారు. ఇందులో సీహార్స్ రెస్టో బార్ ప్రస్తుతం బి-జాగ్, తీరం బీచ్ రిసార్ట్స్, సాంటమ్ బార్ అండ్ రెస్టారెంట్, విరాగో రెస్టో బార్‌లు ఉన్నాయి. ఈ కమిటీ మంగళవారం ఉదయం 8 గంటలకు భీమిలి బీచ్ రోడ్డులో ఉన్న బి–జాగ్ హోటల్ నుంచి క్షేత్ర స్థాయిలో పర్యటించి విచారణ చేపట్టనుంది. వీటి నిర్వాహకులు విచారణ తప్పకుండా హాజరుకావాలని ఆ నోటీస్‌లో పేర్కొన్నారు.



బీచ్ రెస్టారెంట్

అనేక ఫిర్యాదు వచ్చినా.. : వాస్తవానికి ఈ నాలుగు వ్యాపారాలపై జీవీఎంసీ అధికారులకు అనేకసార్లు ఫిర్యాదులు అందాయి. సీఆర్‌జెడ్ నిబంధనలకు విరుద్ధంగా సదరు సంస్థలు నిర్మాణాలు చేపడుతున్నారని చెప్పినప్పటికీ అధికారులు వాటి వైపు కన్నెత్తి చూడలేదు. ఇవి కూటమి ప్రజాప్రతినిధులు, నాయకుల అనుచరులకు సంబంధించినవి కావడంతోనే అధికారులు చూసీచూడనట్లు వదిలేసినట్లు సమాచారం. ఈ వ్యాపారులు కూడా వారి రిసార్టులు, రెస్టో బార్ల ముందు కూటమి ప్రజాప్రతినిధులకు సంబంధించిన భారీ పోస్టర్లు, కటౌట్లు ఏర్పాటు చేసుకున్నారు. దీంతో నిబంధనలను అమలు చేయాల్సిన అధికారులు వాటిని తుంగలో తొక్కుతున్న వారికి సహాయ సహకారాలు అందిస్తూ వచ్చారు. తాజాగా హైకోర్టు జోక్యంతో ఇప్పుడు విచారణకు హడావుడి చేస్తున్నారు.

హైకోర్టు ఆదేశాలతో కమిటీ

భీమిలి పరిధిలో సీఆర్‌జెడ్ నిబంధనలకు విరుద్ధంగా ఏర్పాటైన వ్యాపార కార్యకలాపాలపై జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్‌తో పాటు ఎగువపేట గ్రామ అభివృద్ధి సేవా సంఘం హైకోర్టులో కేసు వేశారు. దీనిపై విచారణ చేపట్టి సమగ్ర నివేదికను సమర్పించాలని కోర్టు అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. ఇందుకోసం జీవీఎంసీ, ఎన్ఐటీ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు, రెవెన్యూ శాఖ అధికారులు నలుగురితో కమిటీ ఏర్పాటు చేశారు. జీవీఎంసీ అదనపు కమిషనర్(ఫైనాన్స్) ఎస్.ఎస్.వర్మ కన్వీనర్‌గా, భీమిలి ఆర్డీఓ కె.సంగీత్ మాథుర్, ఎన్ఐటీ శాస్త్రవేత్త డాక్టర్ వి.వి.ఎస్.ఎస్.శర్మ, కాలుష్య నియంత్రణ మండలి నుంచి సీనియర్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ పి.వి.బి.ఎల్.జి.శాస్త్రి సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీ సభ్యులు క్షేత్ర స్థాయిలో పర్యవేక్షించి సదరు నిర్మాణాలపై విచారణ చేపట్టి కోర్టుకు నివేదిక సమర్పించాల్సి ఉంది.

తూర్పు తీర భద్రతకు సైకిల్ థాన్

విశాఖకు చేరుకున్న సీఐఎస్‌ఎఫ్ సైకిల్‌థాన్ బృందం



జ్ఞాపిక అందజేస్తున్న పోర్టు చైర్మన్ అంగముత్తు, చిత్రంలో కలెక్టర్ హరేందిర ప్రసాద్


ఆర్కేబీచ్ వద్ద సైకిల్‌థాన్‌లో పాల్గొన్న యువతీయువకులు

ఏయూక్యాంపస్/భీమునిపట్నం: దేశ వ్యాప్తంగా తీర ప్రాంతాలగుండా నిర్వహిస్తున్న సీఐఎస్‌ఎఫ్ సైకిల్‌థాన్ సోమవారం సాయంత్రం విశాఖ చేరుకుంది. ఆర్‌కే బీచ్ వద్ద సైకిల్‌థాన్‌లో పాల్గొన్న సీఐఎస్‌ఎఫ్ సిబ్బందిని విశాఖపట్నం పోర్ట్ ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు స్వాగతం పలికారు. 50 మంది సభ్యులతో కూడిన ఈ బృందం సీఐఎస్‌ఎస్ 56వ రైజింగ్ డేని పురస్కరించుకుని సైకిల్ థాన్‌లో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ అంగముత్తు మాట్లాడుతూ 'సేఫ్ కోస్ట్–ప్రోస్పరస్ ఇండియా' అనే నినాదంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సైక్లిథాన్ తూర్పు, పశ్చిమ తీరాలను కలుపుతూ 6,553 కిలోమీటర్ల తీరరేఖ గుండా సాగుతుందన్నారు. సైకిల్‌థాన్‌లో పాల్గొన్న వారికి కలెక్టర్ ఎం.ఎన్ హరేందిర ప్రసాద్ అభినందించారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఇదే బృందం భీమిలి తీరంలో కూడా పర్యటించింది. ఈ సందర్భంగా కేంద్ర పారిశ్రామిక భద్రత దళం (సీఆర్‌పీఎఫ్) అసిస్టెంట్ కమాండెంట్ శ్రీనివాసరావు మాట్లాడుతూ తీర భద్రతలో మత్స్యకారుల పాత్ర కీలకమన్నారు. దేశ రక్షణ, భద్రతా దళాలు ఎన్ని ఉన్నప్పటికీ మొత్తం తీర ప్రాంతాన్ని వారు పర్యవేక్షించలేరని అన్నారు. అయితే ఆయా ప్రాంతాల్లో ఉండే మత్స్యకారులే రక్షకులుగా మారాలన్నారు.

విశాఖ చేరిన ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు


ఎయిర్‌పోర్టులో క్రికెటర్లు

విశాఖ స్పోర్ట్స్: ఐపీఎల్‌లో తొలి మ్యాచ్ ఆడేందుకు ఢిల్లీ క్యాపిటల్స్(డీసీ) జట్టు విశాఖ చేరుకుంది. సోమవారం రాత్రి ప్రత్యేక విమానంలో విచ్చేసిన జట్టు సభ్యుల్ని అభిమానులు హర్షాతిరేకాలతో స్వాగతం పలికారు. కెప్టెన్ అక్షర్ పటేల్‌తో పాటు జట్టు సభ్యులు, సపోర్టింగ్ స్టాఫ్ విమానాశ్రయం నుంచి నేరుగా నోవోటల్‌కు చేరుకున్నారు. వీరంతా మంగళవారం నుంచి నెట్స్‌లో శ్రమించనున్నారు. విదేశీ ఆటగాళ్లు డుప్లెసిస్, ఫ్రేజర్, ఫెరీరా కులసాగా మాట్లాడుకుంటూ విశాఖ విమానాశ్రయానికి చేరుకున్నారు. డీసీ జట్టు డైరెక్టర్ వేణుగోపాలరావు, హెడ్ కోచ్ హేమంగ బదాని విశాఖ చేరుకున్న వారిలో ఉన్నారు. డీసీ జట్టులో ఆంధ్రా ఆటగాడు త్రిపురాన విజయ్ చేరాడు. ఢిల్లీ క్యాపిటల్స్ విశాఖ వేదికగా 24న లక్నో సూపర్ జెయింట్స్, 30న సన్‌రైజర్స్ హైదరాబాద్ జట్లతో తలపడనుంది.

అందుబాటులోకి రూ.వెయ్యి టికెట్లు

ఐపీఎల్ సీజన్‌లో విశాఖ వేదికగా ఢిల్లీ క్యాపిటల్స్ ఆరంభ మ్యాచ్ చూసేందుకు లోయర్ డినామినేషన్ రూ.1000, రూ.1500 టికెట్లు ఆన్‌లైన్‌లో అందుబాటులోకి వచ్చాయి. రూ.వెయ్యి టికెట్ ఈ స్టాండ్‌లో, రూ.1500 టికెట్ ఎం–1 స్టాండ్‌లో అందుబాటులోకి తెచ్చింది.

సీఈ శివప్రసాద్ అవినీతిపరుడు

- ఆయన్ని సస్పెండ్ చేయాలి
- కల్యాణ మండపం నిర్మాణ పనులు నిలిపివేత వెనుక ఎవరున్నారో చెప్పాలి
- 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి


మాట్లాడుతున్న కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి

అక్కిరెడ్డిపాలెం: అత్యంత అవినీతి పరుడైన జీవీఎంసీ సీఈ శివప్రసాదరాజును వెంటనే సస్పెండ్ చేయాలని 69వ వార్డు కార్పొరేటర్ కాకి గోవిందరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం 69వ వార్డు తుంగ్లాంలో ఆయన మీడియాతో మాట్లాడారు. సీఈ తన పట్ల వ్యవహరిస్తున్న నిర్లక్ష్య వైఖరిపై తీవ్ర పదజాలంతో విమర్శించారు. వార్డులో కల్యాణ మండపానికి మేయర్, ఎమ్మెల్యే ద్వారా రూ.కోటి మంజూరు చేయించానన్నారు. పాత కల్యాణమండపం తొలగించి తిరిగి నిర్మిస్తున్న క్రమంలో ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు సీఈ శివప్రసాదరాజు తప్పుడు సమాచారం ఇచ్చి పనులను నిలిపివేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులు ఆపడం వెనుక కారణాలను వివరించాలని పదేపదే దరఖాస్తు చేసినా సీఈ పట్టించుకోవడం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. కల్యాణమండపం నిర్మాణానికి ఏయూ సివిల్ ఇంజినీరింగ్ విభాగం ప్రొఫెసర్ కె.రాంబాబు ఇచ్చిన నివేదికను సైతం సీఈ ఎందుకు బయటపెట్టటం లేదని ప్రశ్నించారు. సీఈ అత్యంత అవినీతి పరుడని, వెంటనే జీవీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్‌గా వ్యవహరిస్తున్న కలెక్టర్ ఈ సంఘటనపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీఈ శివప్రసాదరాజు తీరు మార్చుకోవాలని, ఆయన వెనుక ఎవరున్నా ఈ విషయంలో వెనుకడుగు వేసేది లేదని స్పష్టం చేశారు. 69వ వార్డులో దోమకాటుతో ఎవరైనా జబ్బు పడినా, కలుషిత నీటి వల్ల ఎవరైనా మృతి చెందినా సీఈ శివప్రసాదరాజు బాధ్యత వహించాలన్నారు. ప్రజా సమస్యలు గాలికి వదిలేసి.. ఎవరో అండదండలు చూసుకొని అధికార జులుం ప్రదర్శించాలని చూస్తే ప్రజలే తిరగబడతారని హెచ్చరించారు.

అంతర్జాతీయ స్థాయి నగరంగా విశాఖ

- అందుకు అనుగుణంగా మాస్టర్‌ప్లాన్
- వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ ప్రణవ్‌గోపాల్, కమిషనర్ విశ్వనాథన్


మాట్లాడుతున్న వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్, కమిషనర్ విశ్వనాథన్

విశాఖ సిటీ: విశాఖను అంతర్జాతీయ స్థాయి నగరంగా అభివృద్ధి చేసేందుకు అవసరమైన అన్ని ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వీఎంఆర్‌డీఏ చైర్మన్ ప్రణవ్‌గోపాల్ పేర్కొన్నారు. సోమవారం వీఎంఆర్‌డీఏలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రానికి ఆర్థిక రాజధానిగా ఉన్న విశాఖను పర్యాటక, వాణిజ్యపరంగా అభివృద్ధి చేసేందుకు కసరత్తు చేస్తున్నట్లు చెప్పారు. ఇందుకు అనుగుణంగా 2041 బృహత్తర ప్రణాళికను సిద్ధం చేస్తున్నామన్నారు. రూ.80 కోట్లతో సిరిపురంలో నిర్మించిన మల్టీ లెవెల్ కార్ పార్కింగ్, కమర్షియల్ భవనాన్ని సీఎం చేతుల మీదుగా ప్రారంభిస్తామన్నారు. బీచ్ రోడ్డులో రూ.5 కోట్లతో నిర్మిస్తున్న యూహెచ్3హెచ్ హెలీకాప్టర్ మ్యూజియాన్ని త్వరలోనే ప్రారంభిస్తామని, అనకాపల్లిలో 7 ఎకరాల్లో హెల్త్ సిటీ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు చెప్పారు. అనకాపల్లిలో కొత్తూరు గ్రామం చెరువును హైదరాబాద్ ట్యాంక్ బండ్ తరహాలో అభివృద్ధి చేసేందుకు డీపీఆర్ సిద్ధం చేసినట్లు తెలిపారు. పాలవలస, గంగసాని ఆగ్రహారం, అడ్డూరు, గరివిడి, రామవరం వంటి ప్రాంతాల్లో వేసిన లేఅవుట్లలో అందుబాటు ధరల్లో ఎంఐజీ ఇళ్ల స్థలాలు విక్రయిస్తున్నామన్నారు. ఎటువంటి విమర్శలకు తావులేకుండా పారదర్శకంగా మాస్టర్‌ప్లాన్–2041ను రూపొందిస్తామని మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ స్పష్టం చేశారు.

బిల్లులు చెల్లించకపోతే రోడ్డున పడతాం


కలెక్టర్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న జీవీఎంసీ కాంట్రాక్టర్లు

మహారాణిపేట: బిల్లుల కోసం జీవీఎంసీ కాంట్రాక్టర్లు ఆందోళన బాట చేపట్టారు. పనులు పూర్తి చేసి నెలలు గడుస్తున్నా ఇంకా బిల్లులు మంజూరు కాకపోవడంతో తామంతా ఇబ్బందులు పడుతున్నామని కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. మరో కొద్ది రోజుల్లో ఈ ఆర్థిక సంవత్సరం ముగిసిపోతోందని, ఈ లోగా బిల్లులు చెల్లించాలని అసోసియేషన్ అధ్యక్షుడు గొంప చంద్రమౌళి కోరారు. జీవీఎంసీ సాధారణ పద్దుల్లో గత ఏడాది మార్చి 28వ తేది నుంచి నేటీ వరకు సుమారు రూ.400 కోట్ల బిల్లులు చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేయడం తగదన్నారు. వెంటనే ప్రభుత్వం ఆదుకోకపోతే కాంట్రాక్టర్లు రోడ్డున పడే పరిస్థితి వస్తుందన్నారు. మొత్తం బిల్లులు చెల్లించకపోతే బ్యాంకులో రుణాలు తీసుకున్న కాంట్రాక్టర్లందరూ తీవ్ర ఇబ్బందులు తప్పవని కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లారు. కార్యక్రమంలో పలువురు కాంట్రాక్టర్లు, అసోసియేషన్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

'ఆరోగ్య మిత్ర'ల ఆందోళన


: నిరసన చేస్తున్న ఏపీ ఆరోగ్య మిత్ర ఉద్యోగులు

మహారాణిపేట: కనీస వేతనాలు అమలు కావడం లేదు..17 ఏళ్లుగా క్యాడర్ అమలు చేయడంలేదని డాక్టర్ ఎన్టీఆర్ వైద్య సేవ ఫీల్డ్ ఉద్యోగులు ఆందోళనకు దిగారు. సమస్యలు పరిష్కరించాలంటూ కలెక్టరేట్ వద్ద ఆరోగ్యమిత్ర కాంట్రాక్ట్ అండ్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో ఉద్యోగులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విధి నిర్వహణలో ఎవరైనా మృతి చెందితే కనీస పరిహారం ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ ఉద్యోగాలలో వెయిటేజ్ లేదు, రిటైర్మెంట్ బెనిఫిట్స్ లేవు, ప్రభుత్వ ఉద్యోగిగా గుర్తింపు ఉండటంతో సంక్షేమ పథకాలు అందడం లేదని వాపోయారు. సమస్యలు పరిష్కరించాలని యూనియన్ నేతలు ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోలేదన్నారు. అందుకే ఆందోళన చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కార్యక్రమంలో ఏపీ ఆరోగ్యమిత్ర కాంట్రాక్ట్ అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు మల్లికా, స్వర్ణ, రమేష్, దుర్గాప్రసాద్, జానకిరామ్, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

విశాఖకు ఆగ్నేయ దేశాల బౌద్ధ పర్యాటకులు


బౌద్ధ క్షేత్రంలో విదేశీ బౌద్ధ పర్యాటకులు

విశాఖ సిటీ: ఆగ్నేయ దేశాల నుంచి బౌద్ధ పర్యాటకుల తొలి బ్యాచ్ విశాఖకు చేరుకుంది. సోమవారం వీరిని కలెక్టర్ హరేందిర ప్రసాద్, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, వీఎంఆర్‌డీఏ కమిషనర్ కె.ఎస్. విశ్వనాథన్‌లు స్వాగతం పలికారు. ఆంధ్రప్రదేశ్ టూరిజం ఫోరం అధ్యక్షుడు విజయ్‌మోహన్ ఆధ్వర్యంలో ఈ పర్యాటక బృందం బావికొండ, తొట్లకొండ, పావురాలకొండ, బొజ్జన్నకొండలను సందర్శించింది. ఇక్కడి నుంచి థాయ్‌లాండ్, మలేషియా, సింగపూర్‌లకు విమాన సర్వీసులు ఉండడంతో రాష్ట్ర ప్రభుత్వం ఆగ్నేయ దేశాల పర్యాటకులే లక్ష్యంగా ఇన్‌బౌండ్ టూరిజంకు శ్రీకారం చుట్టింది. ఆయా దేశాల్లో ఎక్కువ మంది బౌద్ధులు ఉండడంతో వారిని రాష్ట్రానికి రప్పించేందుకు ఆంధ్రప్రదేశ్‌లో అన్ని ప్రాంతాల్లో ఉన్న బౌద్ధ క్షేత్రాలను కలుపుతూ బుద్ధిస్ట్ సర్క్యూట్‌ను రూపొందించింది. ఇందులో భాగంగానే ఆగ్నేయ దేశాల నుంచి బౌద్ధ పర్యాటకులు రాష్ట్రానికి వచ్చి బౌద్ధక్షేత్రాలను సందర్శించనున్నారు.

మరో కాంబోడియా ఏజెంట్ అరెస్ట్

విశాఖ సిటీ: విదేశాల్లో భారీ జీతంతో డేటా ఎంట్రీ ఉద్యోగం పేరుతో నిరుద్యోగులను మభ్యపెట్టి కాంబోడియా, మయన్మార్, బ్యాంకాక్‌లోని చైనా స్కామ్ కంపెనీలకు తరలిస్తున్న విశాఖకు చెందిన మరో ఏజెంట్‌ను సైబర్ క్రైమ్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గోపాలపట్నంకు చెందిన చిట్టిబొమ్మ భువన్ సాయి అనే వ్యక్తి శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఒకరి ద్వారా కాంబోడియాకు వెళ్లాడు. అక్కడ చైనా ఆధారిత స్కామ్ జాబ్ కంపెనీలో పనిచేస్తూ భారతీయులను మోసం చేయడమే లక్ష్యంగా చేసుకున్నాడు. ఫేస్‌బుక్, ఇతర సోషల్ మీడియా మాధ్యమాల ద్వారా చైనా కంపెనీలు అందించే స్క్రిప్ట్‌ల ఆధారంగా ప్రజలను నమ్మించి మోసం చేసేవాడు. కొద్ది కాలానికి అతడు విశాఖకు తిరిగి వచ్చాడు. కొన్నాళ్లకు మళ్లీ తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలని భావించి ముందు పనిచేసిన కంపెనీలో ఉన్న శియాస్ అనే వ్యక్తిని సంప్రదించాడు. అతడు భారత్‌లో ఉద్యోగం కోసం చూస్తున్న వారిని అక్కడకు పంపిస్తే ఒకరికి రూ.60 వేలు కమీషన్ ఇస్తానని చెప్పాడు. దీంతో భువన్‌సాయి తనకు తెలిసిన ముగ్గురు యువకులకు బ్యాంకాక్‌లో ఉద్యోగం ఉందని చెప్పి నమ్మించాడు. ఆన్‌లైన్‌లో ఇంటర్వ్యూ నిర్వహించి సెలెక్ట్ అయినట్లు చెప్పాడు. ఈ ఏడాది జనవరిలో భువన్ సాయి వారిని మయన్మార్‌లో కంపెనీ ప్రతినిధికి అప్పగించి తిరిగి విశాఖకు వచ్చాడు. అలా వెళ్లిన వారు సైబర్ నేరాల కోసమే తమను వినియోగించుకుంటున్నారని గ్రహించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసుల సహకారంతో తిరిగి విశాఖకు చేరుకున్నారు. వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఏజెంట్‌గా వ్యవహరించిన భువన్‌సాయిని పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు.

జీవీఎంసీ ప్రాజెక్టులు అద్భుతం

- ఐఏఎస్‌ల బృందం కితాబు


జీవీఎంసీని సందర్శించిన ఐఏఎస్‌ల బృందం

సాక్షి, విశాఖపట్నం/డాబాగార్డెన్స్: జీవీఎంసీని వివిధ రాష్ట్రాలకు సంబంధించి స్టేట్ సివిల్ సర్వీసెస్ నుంచి ఐఏఎస్‌లుగా పదోన్నతి పొందిన అధికారుల బృందం సోమవారం సందర్శించింది. జీవీఎంసీ పరిపాలన విధానం, ప్రాజెక్టులు చాలా అద్భుతంగా ఉన్నాయని గ్రూప్ లీడర్ రక్షణ్ పాంట్ మారక్ పేర్కొన్నారు. మధ్యప్రదేశ్, సిక్కిం, గుజరాత్, మేఘాలయ తదితర రాష్ట్రాల నుంచి 126వ ఇండక్షన్ ట్రెనింగ్ ప్రోగ్రామ్ గ్రూప్–5 సివిల్ సర్వీసెస్ నుంచి ఐఏఎస్‌లో పదోన్నతి పొందిన 19 మంది ట్రెనీ ఐఏఎస్‌లు జీవీఎంసీ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో జీవీఎంసీ యంత్రాంగం చేపడుతున్న అభివృద్ధి,వివిధ ప్రాజెక్టులను బృందానికి అధికారులు వివరించారు. ఇతర రాష్ట్రాలకు జీవీఎంసీ ప్రాజెక్టులు ఆదర్శప్రాయంగా ఉన్నాయని రక్షణ్ పాంట్ మారక్ పేర్కొన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ అదనపు కమిషనర్లు డీవీ రమణమూర్తి, ఎస్ఎస్ వర్మ, డీపీవో ఫణిరామ్, ప్రధాన వైద్యాధికారి నరేష్ కుమార్, పర్యవేక్షక ఇంజనీర్లు కేవీఎస్ రవి, రాజేంద్ర కృష్ణ, వ్యయ పరిశీలకుడు వాసుదేవరెడ్డి, కార్యనిర్వాహక ఇంజినీరు ఏడుకొండలు, డీసీపీ హరిదాసు, సీపీ, పలువురు అధికారులు పాల్గొన్నారు. ఐఏఎస్‌లుగా పదోన్నతి పొందిన అధికారుల బృందం విశాఖపట్నం పోర్టు అథారిటీ (వీపీఏ)ని సోమవారం సందర్శించింది. పోర్టులో ఆధునిక మౌలిక సదుపాయాలు, యాంత్రీకరణ సామర్థ్యాల గురించి బృందానికి వివరించారు.కార్యక్రమంలో పోర్ట్ విభాగాధిపతులు, సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

కేసుల రాజీకి మధ్యవర్తిత్వ విధానం మేలు


మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్

విశాఖ లీగల్ : న్యాయస్థానాల్లో అపరిష్కృతంగా ఉన్న కేసులను పరిష్కరించడానికి మధ్యవర్తిత్వ విధానాన్ని అవలంబించాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆలపాటి గిరిధర్ సూచించారు. రాష్ట్ర హైకోర్టు న్యాయ సేవ ప్రాధికార సంస్థ సూచన మేరకు నగరంలోని నూతన న్యాయస్థానాల భవనం సమావేశ మందిరంలో సోమవారం గ్రామీణ, నగర ప్రాంత న్యాయవాదులకు మధ్యవర్తిత్వంపై 40 గంటల శిక్షణ శిబిరాన్ని న్యాయమూర్తి ప్రారంభించారు. ఈ సందర్భంగా గిరిధర్ మాట్లాడుతూ మధ్యవర్తిత్వ విధానం వల్ల కేసుల రాజీ జరిగితే అది న్యాయవాదులకు ఎంతో మేలు చేకూరుస్తుందని చెప్పారు. కేసులు ప్రాథమిక స్థాయిలోనే తీర్పు చెప్పే విధంగా కక్షిదారులను సంసిద్ధం చేయవలసిన బాధ్యత మధ్యవర్తులపై ఉందన్నారు. స్వల్ప వివాదాల్లో జరిగిన అనేక సమస్యలకు మధ్యవర్తిత్వం ఓ వెలుగు కిరణమని భారత సర్వోన్నత న్యాయస్థానం న్యాయవాది, మధ్యవర్తిత్వ కేంద్రం శిక్షకులు ఎస్.అరుణాచలం అన్నారు. కేసులు రాజీ ఉభయులకు అనుకూలంగా తీర్పు వస్తుందన్నారు. తొలి దశలో ఇరువురి న్యాయవాదులు తమ కేసు వివరాలను ఆలోచనలను న్యాయమూర్తులతో పంచుకుంటే తీర్పులు సత్వరం వచ్చే అవకాశం ఉందన్నారు. సుప్రీం కోర్టు మధ్యవర్తిత్వ కేంద్రం శిక్షకురాలు బీనా దేవరాజ్ మాట్లాడుతూ న్యాయవాదులు చాకచక్యంగా కేసులను రాజీ చేయాలన్నారు. సత్వర తీర్పులకు మధ్యవర్తిత్వ విధానాన్ని పాటించాలని విశాఖ జిల్లా న్యాయ సేవ ప్రాధికార సంస్థ కార్యదర్శి ఎంవీ శేషమ్మ సూచించారు. ఈ నెల 22వ తేదీ వరకు శిక్షణ జరుగుతుంది.

మా నమ్మకాన్ని గెలిపించిన 'కోర్ట్'

- నగరంలో చిత్రం బృందం సందడి


సక్సెస్ మీట్‌లో చిత్ర యూనిట్

డాబాగార్డెన్స్: నగరంలో కోర్ట్ చిత్ర యూనిట్ సోమవారం సందడి చేసింది. శివాజీ మంగపతిగా, ప్రియదర్శి పులికొండ లాయర్ పాత్రలో నటించగా, హీరో హర్ష రోషన్, హీరోయిన్లు శ్రీదేవి, విషిక, రైటర్ కమ్ డైరెక్టర్ రామ్ జగదీష్ నగరంలోని ఓ హోటల్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. కోర్ట్ సినిమా మా అందర్నీ గెలిపించిందన్నారు. మంచి చిత్రాలకు ఎప్పుడూ ఆదరణ ఉంటుందని మరోసారి ప్రేక్షకులు నిరూపించారన్నారు. విశాఖ సీతమ్మపేట, ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఇంజినీరింగ్ చదివిన రామ్ జగదీష్ రాసిన ఈ కథ తెలుగు ప్రేక్షకులను ఎంతగానో ఆదరించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. నాని సహ ప్రొడ్యూసర్‌గా వ్యవహరించిన ఈ సినిమా ఎంతో అద్భుతంగా తెరకెక్కిందన్నారు. చట్టంపై అవగాహన కల్పిస్తూ ఈ చిత్రం రూపుదిద్దుకుందన్నారు. యువతకు మంచి మెసేజ్ ఇచ్చిన చిత్రంగా నిలిచినందుకు ఆనందంగా ఉందన్నారు. పోక్సో చట్టంపై కోర్టు చిత్రం మరింత అవగాహన కల్పించిందన్నారు. విడుదలైన మూడు రోజుల్లోనే రికార్డు స్థాయిలో రూ.25 కోట్ల మేర కలెక్షన్స్ రావడం చిత్ర విజయానికి నిదర్శనమన్నారు. విశాఖలో పలు థియేటర్లలో ప్రేక్షకులను స్వయంగా కలిసినట్టు తెలిపారు. చిత్రంలో సాయికుమార్, హర్షవర్ధన్, రోహిణి మొల్లేటి, రాజేశేఖర్, సురభి ప్రభావతి, విశాఖ కీర్తి ప్రముఖ పాత్రలు పోషించారన్నారు. సమావేశంలో శ్రీవేంకటేశ్వర ఫిల్మ్ అధినేత విజయ్‌భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

న్యాయవాదుల ఎన్నికలకు ముమ్మరంగా నామినేషన్లు


ఎన్నికల అధికారికి నామినేషన్ పత్రాలను సమర్పిస్తున్న న్యాయవాది ఎంకే శ్రీనివాస్

విశాఖ లీగల్ : విశాఖ న్యాయవాదుల సంఘం ఎన్నికలకు సంబంధించి సోమవారం భారీగా నామినేషన్లు దాఖలయ్యాయి. అధ్యక్ష స్థానానికి ప్రముఖ న్యాయవాది ఎంకే శ్రీనివాస్, నమ్మి సన్యాసిరావు, ఐఎం అహమ్మది నామినేషన్ దాఖలు చేశారు. ఉపాధ్యక్షుల కోసం ఎస్‌టీపీ గోపాలకృష్ణ, చింతపల్లి ఆనంద్ కుమార్, పీలా మీనాక్షి, కార్యదర్శి పదవికి ఎల్బీ నాయుడు, ఎం.సుధాకర్, సోమేశ్వరరావు, రాపేటి సూర్యనారాయణ నామినేషన్ వేశారు. ఇతర పోస్టులకు మరో 20 మంది న్యాయవాదులు నామినేషన్ దాఖలు చేశారు.

పలు రైళ్లకు అదనపు కోచ్‌లు

తాటిచెట్లపాలెం: ప్రయాణికుల సౌకర్యార్థం పలు రైళ్లకు అదనంగా జనరల్, స్లీపర్ క్లాస్ కోచ్‌లను తాత్కాలికంగా జతచేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. విశాఖ–కోరాపుట్–విశాఖ (18512/18511) పాసింజర్ స్పెషల్‌కు సోమవారం నుంచి 2–స్లీపర్‌క్లాస కోచ్‌లను, విశాఖ–గుణుపూర్–విశాఖ (58506/58505) పాసింజర్‌కు మంగళవారం నుంచి 1–స్లీపర్ క్లాస్ కోచ్‌ను, విశాఖ–భువనేశ్వర్–విశాఖ (22820/22819) ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌కు సోమవారం నుంచి 2–స్లీపర్ క్లాస్ కోచ్‌లను అదనంగా జత చేశామన్నారు.

అరకు వరకే కిరండూల్ పాసింజర్

తాటిచెట్లపాలెం: భద్రతా పనుల నిమిత్తం విశాఖపట్నం–కిరండూల్–విశాఖపట్నం(58501/58502) పాసింజర్ ఏప్రిల్ 2వ తేదీ నుంచి 10వ తేదీ వరకు అరకు స్టేషన్ వరకు మాత్రమే రాకపోకలు సాగిస్తుందని వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. ఈ తేదీల్లో అరకు–కిరండూల్ మధ్య ఈ పాసింజర్ నడవదని పేర్కొన్నారు.

ఏయూకు రూ.34 కోట్లు విడుదల

విశాఖ విద్య: ఆంధ్ర యూనివర్సిటీ ఆచార్యులు, ఉద్యోగులు, పెన్షనర్లకు పెండింగ్ బకాయిలు నిమిత్తం ప్రభుత్వం రూ.34 కోట్లు విడుదల చేస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. జనవరి, ఫిబ్రవరి వేతనాల నిమిత్తం వీటిని మంజూరు చేస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరం బకాయిల కింద వీటిని విడుదల చేశారు.

సరిహద్దు, తీర ప్రాంత భద్రత బలోపేతం


మాట్లాడుతున్న సీపీ శంఖబ్రత బాగ్చీ

విశాఖ సిటీ: రాష్ట్రంలోకి మాదక ద్రవ్యాల రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు సరిహద్దు నిఘాతో పాటు తీర ప్రాంత భద్రతను బలోపేతం చేయాలని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి పేర్కొన్నారు. మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగాన్ని నిరోధించేందుకు నార్కోటిక్స్ కంట్రోల్ బ్యూరో (ఎన్‌సీబీ) ఆధ్వర్యంలో పోలీస్, డీఆర్‌ఐ, కస్టమ్స్, ఎక్సైజ్, ఐబీ, రీసెర్చ్ అండ్ అనాలసిస్ వింగ్, ఆర్‌పీఎఫ్, ఈగల్, ఇతర సంబంధిత శాఖలతో తొలి సమన్వయ సమావేశాన్ని ఎస్‌బీ కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాదక ద్రవ్యాల నియంత్రణకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ప్రధానంగా రాష్ట్రంలోనే కాకుండా బయట ఉన్న డ్రగ్స్ నెట్‌వర్క్‌లపై నిఘా పెట్టడంతో పాటు అన్ని శాఖల సమన్వయంతో ఉమ్మడి కార్యాచరణ సిద్ధం చేయాలని నిర్ణయించారు. గంజాయి సాగు, ఉత్పత్తి, సింథటిక్ డ్రగ్స్ నిర్మూలన ప్రయత్నాలను బలోపేతం చేయడంతో పాటు సాగుదారులకు పునరావాస కార్యక్రమాలపై సమీక్షించారు. సాంకేతికత ఆధారంగా సమాచార మార్పిడి, విద్యా సంస్థల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు, ఇలా అనేక అంశాలపై చర్చించారు. ఇకపై క్రమం తప్పకుండా సమన్వయ సమావేశాలు నిర్వహించాలని తీర్మానించారు. ఈ సమావేశంలో ఎన్‌సీబీ సదరన్ రీజియన్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ టి.జి.వెంకటేష్, ఎన్‌సీబీ అడిషినల్ డైరెక్టర్ పి.అరవిందన్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

డాక్టర్ బాలపరమేశ్వరరావు సేవలు చిరస్మరణీయం


బాల పరమేశ్వరరావు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ హరేందిర ప్రసాద్

మహారాణిపేట: ఆంధ్ర వైద్యకళాశాల పూర్వ విద్యార్థి, ప్రముఖ న్యూరోసర్జన్, దివంగత డాక్టర్ సుంకర బాల పరమేశ్వరరావు అందించిన సేవలు, ఆయనపేరు వైద్య రంగ చరిత్రలో చిరస్మరణీయంగా నిలిచిపోతాయని కలెక్టర్ హరేందిర ప్రసాద్ అన్నారు. కేజీహెచ్ న్యూరోసర్జరీ విభాగానికి ఆయన పేరును ఖరారు చేస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో సోమవారం కేజీహెచ్ సూపర్ స్పెషాలిటీ బ్లాక్‌లో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్ బాలపరమేశ్వరరావు చేసిన ఎనలేని సేవలకు గుర్తింపుగా న్యూరో సర్జరీ విభాగానికి ఆయన పేరు పెట్టడం గొప్ప విషయమన్నారు. అనంతరం పరమేశ్వరరావు విగ్రహాన్ని ఆవిష్కరించి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను అతిథులతో కలిసి తిలకించారు. కార్యక్రమంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ ఎస్‌వీ ఆదినారాయణరావు, ఆంధ్ర వైద్య కళాశాల న్యూరో సర్జరీ పూర్వ విభాగాధిపతి డాక్టర్ ఐ.దినకర్, డాక్టర్ ఆర్.శశిప్రభ, డాక్టర్ బి.సుబ్బారావు, వరుణ్ గ్రూప్ చైర్మన్ ప్రభు కిశోర్, కేజీహెచ్ సూరింటెండెంట్ డాక్టర్ కె.శివానంద, ఆంధ్రవైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీఎం సంధ్యాదేవి, డాక్టర్ ఎం.ప్రేమ్‌జిత్ రే, డాక్టర్ బి.హయగ్రీవ రావు పాల్గొన్నారు.